సాక్షి
కృష్ణాజిల్లా
మంగళవారం । 17 । జూన్ । 2025



ఈవీఎం గోడౌన్ తనిఖీ

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకె బాలాజీ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణం లోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు.



పనిభారం తగ్గించండి

గాంధీనగర్: పనిభారం తగ్గించి, ప్రమోషన్ చానల్ కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విజయవాడ అలంకార్ సెంటర్‌లో సోమవారం ధర్నా చేశారు.

ఆర్‌ఐవో బాధ్యతల స్వీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్మీడియెట్ ప్రాంతీయ అధికారిగా జి. ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్‌ఐవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సాల్మన్‌రాజు స్థానంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్‌ఐవోగా పని చేస్తున్న ప్రభాకర్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్‌ఐవోగా ప్రభుత్వం నియమించింది.



న్యూస్‌రీల్

'శక్తి సేవ'కు ప్రాధాన్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులకు నిస్వార్థంగా ఉచిత సేవలు అందించే సేవకులకు, భక్త బృందాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. దేవస్థానంలో సేవలు అందించే సేవా బృందాలతో ఈవో శీనానాయక్ సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో సమావేశమయ్యారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు సేవ చేయడం అమ్మవారికి సేవ చేయడంతో సమానమని పేర్కొన్నారు. తిరుమలలో శ్రీవారి సేవగా ప్రాచుర్యం పొందగా, దుర్గమ్మ సన్నిధిలో శక్తి సేవగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

ఆభరణాల అప్పగింత కార్యక్రమం ప్రారంభం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ వారి బంగారు, వెండి ఆభరణాల అప్పగింత కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. దుర్గగుడి పూర్వ ఈవో కేఎస్ రామరావు పదవీ విరమణ అనంతరం వారి ఆధీనంలో ఉన్న ఆభరణాలను దేవస్థానానికి అప్పగించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ ఆభరణాలు దేవస్థాన ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఉండగా, సోమవారం ఆభరణాల అప్పగింత కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలోని చైర్మన్ చాంబర్‌లో ప్రస్తుత ఈవో శీనానాయక్, పూర్వ ఈవో రామరావు దేవస్థాన రికార్డుల ప్రకారం అమ్మవారి ఆభరణాలను అధికారుల సమక్షంలో సరి చూసుకున్నారు. మంగళవారం వివిధ బ్యాంకు లాకర్లలో ఉన్న వస్తువులను అప్పగింత కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

పూర్తయిన బదిలీలు

మచిలీపట్నంఅర్బన్: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ సాధారణ బదిలీలు చేపట్టి పూర్తిచేసినట్లు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేడర్ వారీగా చేపట్టిన బదిలీల్లో మొత్తం 4,120 ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు పొందగా, అందులో 110 మంది ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్-2), 217 మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు, 1,933 స్కూల్ అసిస్టెంట్స్, 1,885 సెకండరీ గ్రేడ్ టీచర్స్, 85 భాషా పండితులు, 24 పీఈటీలు, 27 ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. కొత్తగా బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో 16వ తేదీ నుంచి విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో మంగళవారం నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌వైఈఎస్ మనోహరరావు సోమవారం తెలిపారు. వారానికి రెండు రోజులు వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులతో క్షేత్రస్థాయి సందర్శన, చర్చా ఘోష్టి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి మంగళ, బుధవారాల్లో ముందుగా తయారుచేసిన షెడ్యూలు ప్రకారం ఆయా గ్రామాలను సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చేపట్టాల్సిన నూతన పద్ధతులను అధికారులు రైతులకు వివరిస్తారన్నారు. అలాగే రైతులకు కావాల్సిన సాంకేతిక పరమైన సలహాలను అక్కడికక్కడే శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేస్తారన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ

మచిలీపట్నంఅర్బన్: కృష్ణాజిల్లాలో ఏర్పాటు చేసిన 05 పరీక్ష కేంద్రాలలో మెగా డీఎస్సీ పరీక్ష సోమవారం ప్రశాంతంగా సాగాయి. ఉదయం సెషన్లో పరీక్షకు 1,435 అభ్యర్థులకు 1,358 మంది హాజరుకాగా 77 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్లో 1,433 అభ్యర్థులకు 1,383 మంది హాజరవగా.. 50 మంది గైర్హాజరయ్యారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పలు జర్నలిస్ట్ సంఘాల విజ్ఞాపన మేరకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశానుసారం జిల్లాలోని అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డీఈవో ప్రైవేటు విద్యాసంస్థలకు సూచించారు. అలాగే జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఆయా ప్రాంతాల్లోని జర్నలిస్టులకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పండగ చేసుకుంటున్న తమ్ముళ్లు!

ఉమ్మడి జిల్లాలో ఇసుకను బొక్కేస్తున్న పచ్చ నేతలు

- రాత్రిళ్లు యథేచ్ఛగా అక్రమ రవాణా
- ఒక్కో రీచ్ నుంచి రోజుకు 200 టిప్పర్లకు పైగానే తరలిస్తున్న వైనం
- ఒక్కో టిప్పర్‌కు రూ.12వేల నుంచి రూ.22వేల వరకూ ఆదాయం
- కోట్ల రూపాయలు దోచుకొంటున్న ప్రజా ప్రతినిధులు
- హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతర్
- ఉన్నతాధికారుల హెచ్చరికలు పట్టించుకోని అక్రమార్కులు



పెనమలూరు మండలం చోడవరం ఇసుక క్వారీ నుంచి రాత్రి వేళ తరలిపోతున్న ఇసుక లారీలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పేరుకు మాత్రమే ఉచిత ఇసుక.. కానీ ఉమ్మడి కృష్ణా జిల్లాలో పేదలకు ఎక్కడా ఉచితంగా లభించటం లేదు. 'పచ్చ' నేతలకు మాత్రమే ఉచితంగా ఇసుక దొరుకుతోంది. వారు దీనిని ఆదాయ వనరుగా మార్చుకొని కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. రాత్రివేళల్లో వందలాది టిప్పర్లను సరిహద్దులు దాటిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

కృష్ణానది పొడవునా..

కృష్ణా జిల్లాలో విజయవాడ శివారు చోడవరం మొదలు అవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటసాల శివారు శ్రీకాకుళం వరకూ ఆరు చోట్ల ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. పమిడిముక్కల మండలం లంకపల్లి, తోట్లవల్లూరు మండలం రొయ్యూరు, వల్లూరుపాలెం, నార్త్ వల్లూరు, పెనమలూరు మండలం చోడవరం, ఘంటసాల మండలం శ్రీకాకుళం, చల్లపల్లి మండలం ఆముదార్లంక గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతోంది.

- రొయ్యూరు నుంచి రాత్రీ పగలూ తేడా లేకుండా గుడివాడ నియోజక వర్గ ప్రజా ప్రతినిధి, పార్లమెంటు ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లో బందరు పోర్టుకు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో రోజుకు 200కు పైగా టిప్పర్లు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుక రూ.12వేల నుంచి రూ.22 వేల వరకూ అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. రోజుకు రూ.25లక్షల నుంచి రూ.30లక్షల మేర దోపిడీ చేస్తున్నట్లు చెబుతున్నారు.
- పెనమలూరులోని చోడవరం రీచ్ నుంచి అనధికారికంగా నియోజకవర్గ ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో రోజుకు వందల లారీల ఇసుకను తరలిస్తున్నారు.
- పామర్రు నియోజకవర్గ ప్రజాప్రతినిధికి చెందిన బినామీ సంస్థకు నార్తు వల్లూరు ఇసుక రీచ్ వచ్చింది. ఈ రీచ్‌ను ఇప్పటికే ప్రతి రోజు ఎలాంటి అనుమతులు లేకుండా రోజుకు 300కు పైగా లారీల ఇసుకను అక్రమంగా తరలించి, కోట్ల రూపాయలను దోపిడీ చేస్తున్నారు.
- లంకపల్లి ఇసుక రీచ్‌ను ఓ మంత్రికి చెందిన బినామీ సంస్థ దక్కించుకొంది.
- జిల్లాలోని ఇసుక రీచ్‌లన్నింటిని పచ్చనేతలు తమ కనుసన్నల్లో ఉంచుకొని ఒక రోజుకు రూ.2కోట్ల వరకూ కొల్లగొడుతున్నారు.



ఎడ్లంక పుష్కరఘాట్ నుంచి పొక్లయినర్‌తో ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం

కలెక్టర్ ఆదేశాలిచ్చినా..

నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో అక్టోబర్ 15వ తేదీ వరకూ నదుల్లో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ నాలుగు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇసుక తవ్వకాలు, రవాణాని నిలిపి వేయాలని ఆదేశించారు. అయినా ఎక్కడా ఇసుక తవ్వకాలు ఆగలేదు. రాత్రిళ్లు యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగుతోంది.

అడ్డు చెబితే అంతే సంగతులు..

ఇసుక అక్రమ రవాణాని ఎవరన్నా అడ్డుకుంటే అక్రమార్కులకు దాడులకు తెగబడుతున్నారు. ఆదివారం అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంక పుష్కరఘాట్ నుంచి పొక్లయినర్ పెట్టి ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఆ గ్రామ సర్పంచ్ పాలెపు సామ్రాజ్యం భర్త దుర్గారావు అడ్డు చెప్పారు. అందుకు ఆగ్రహించిన ట్రాక్టర్ డ్రైవర్ అతని మీదకు ట్రాక్టర్‌ను పోనిచ్చి చంపేందుకు ప్రయత్నించారు. దుర్గారావు చాకచక్యంగా తప్పుకోగా.. ట్రాక్టర్ దిగొచ్చి అతనిపై ట్రాక్టర్ డ్రైవర్ పిడిగుద్దులు గుద్ది, చొక్కా చింపేయడంతో అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అవినీతి 'కిశోరం'..

ఎన్టీఆర్ జిల్లాలో పార్లమెంటు ప్రజా ప్రతినిధి ఆఫీసులో ఉండే ఓ అవినీతి 'కిశోరం' చక్రం తిప్పి కేవలం చందర్లపాడు మండలం కసరబాద, కంచికచర్ల మండలం వేములపల్లి రీచ్‌ల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. లారీ లోడింగ్ రూ. 10వేల చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దీంతోపాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో వత్సవాయి మండలంలో ఆలూరుపాడులో ఇసుక రీచ్ సైతం ఈయన కనుసన్నల్లోనే నడుస్తోంది. జగ్గయ్యపేట మండలంలోని పోలేరు, కృష్ణా నది నుంచి ఉచిత ఇసుక పేరుతో భారీగా ఇసుక ముక్త్యాల గ్రామం మీదుగా తెలంగాణకు తరలివెళ్తోంది. ఇసుక కృత్రిమ కొరతను సృష్టించి మరీ రోజుకు 200 లారీలకు పైగా ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలించి, దోపిడీ చేస్తున్నారు. తనకు 'చినబాబు' అండదండలు ఉన్నాయని ఆ అవినీతి 'కిశోరం' అధికారులను బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది.

స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి చర్యలు

కలెక్టర్ డీకే బాలాజీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి అంశాలు ఏమైనా ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జూన్ 14 నాటికి మార్పులు, చేర్పులు చేపట్టిన అనంతరం జిల్లాలో 15,41,283 మంది ఓటర్లు ఉన్నారని వీరిలో 7,46,647మంది పురుషులు, 7,94,586 మంది మహిళలు, 50 మంది ఇతరులు ఉన్నారన్నారు. పోలింగ్ బూత్ వివరాలు తెలిపే చిరునామాలో కులాల పేర్లతో కూడిన పదాలను వాడకుండా చూడాలని అదే విధంగా ఎన్నికలకు సంబంధించిన పత్రాల్లో కొన్ని ఆంగ్ల పదాలను తెలుగుభాషలో తర్జుమా చేసే క్రమంలో సరైన పదాలను వినియోగించాలని పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతినిధుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో స్వాతి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పీవీ గజేంద్రరావు, దిలీప్‌కుమార్, కొడాలి శర్మ, ఎస్. బాలాజీ పాల్గొన్నారు.

అవగాహన లేకుండా చర్యలొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర అధికారులు

- సరైన పద్ధతిలో సమస్యలు పరిష్కరించాలి
- అధికారులతో కలెక్టర్ బాలాజీ
- మీ కోసంలో ప్రజల నుంచి 133 అర్జీలు స్వీకరణ


చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో చాలా మంది అధికారులు అవగాహన లోపంతో అర్జీల పరిష్కారం తప్పుగా చేస్తున్నారని, ఇకనైనా దానిని సరిదిద్దుకుని సరైన పద్ధతిలో వాటిని పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో చంద్రశేఖరరావు, మెప్మా పీడీ పి. సాయిబాబు, సమగ్ర శిక్ష ఏపీసీ కుముదినీ సింగ్, ఆర్డీవో కె. స్వాతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ప్రభుత్వ పాలసీ ప్రకారం త్వరలో మంజూరవుతుందని చెప్పటంతో పాటు పరిష్కార పోర్టల్‌లో లబ్ధి పొందినట్లుగా చెబుతున్నారని ఇది చాలా తప్పన్నారు. అర్జీదారులు పరిష్కారం పొందకుండానే పరిష్కారం పొందినట్లు చూపటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా కాకుండా త్వరలోనే లబ్ధి పొందుతారని సమాధానం ఇవ్వాలన్నారు. సంబంధిత అధికారి అర్జీదారులతో తప్పనిసరిగా మర్యాదగా మాట్లాడి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మీకోసం కార్యక్రమంలో మొత్తం 133 అర్జీలను స్వీకరించారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన మత్తి కృష్ణారావు తన పొలం రీ-సర్వే నంబర్ 605-1, 22-1లోని 17 సెంట్లు, భార్యకు సంబంధించిన ఏడు సెంట్లను కృష్ణానది కరకట్ట వెడల్పు చేసి రోడ్డు నిర్మాణం కోసం తీసుకున్నారు. అయితే తనకు రావాల్సిన నష్టపరిహారం సరిహద్దు రైతులకు ఇచ్చారని అధికారులు విచారణ జరిపి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- జిల్లా పరిధిలోని బుడమేరు చంద్రయ్య డ్రెయిన్, ఐనంపూడి తదితర డ్రెయిన్లలో పూడిక తీయించాలని కొన్నేళ్లుగా ఈ డ్రెయిన్లలో పూడికతీయకపోవటం వల్ల తుపాను సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడినప్పుడు వివిధ దశల్లో ఉన్న పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. అలాగే ఆరుగాలం పండించిన పంటకు రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోరిశెట్టి నాగేశ్వరరావు అర్జీ ఇచ్చారు.
- చల్లపల్లి మండలం తాలిపేట గ్రామానికి చెందిన తప్పిరి సుబ్బారావు దివ్యాంగుడు. కాగా తనకు మూడు చక్రాల వాహనం లేదని ఇతరుల వాహనంలో వచ్చానని, తనకు బ్యాటరీ మూడు చక్రాల సైకిల్‌ను ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. వికలాంగుల సంక్షేమశాఖ అధికారులతో మాట్లాడి వెంటనే బ్యాటరీ వాహనాన్ని ఆ దివ్యాంగుడికి కలెక్టర్ అందజేశారు.

రేపు పామర్రులో జాబ్‌మేళా

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన పామర్రులో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 18వ తేదీ పామర్రులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో ఈ జాబ్ మేళా ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. హెటిరో ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, టాటా క్యాపిటల్, వరుణ్ మోటార్స్, అపోలో ఫార్మసీ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ కంపెనీల్లో ఉద్యోగాల కోసం పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి మంచి వేతనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, మెప్మా పీడీ సాయిబాబు, సమగ్ర శిక్ష ఏపీసీ కుముదినీసింగ్, ఆర్డీవో కె. స్వాతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి. నరేష్‌కుమార్, ఉపాధి కల్పన శాఖాధికారి డి. విక్టర్‌బాబు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు

కక్షపూరిత విధ్వంసం

ఏడాది కూటమి పాలనలో పేదలకు తప్పని పాట్లు

- బందరులో పేట్రేగిపోతున్న మట్టి మాఫియా
- పేదల ఇళ్లను కూల్చిన కూటమి పెద్దలు
- ఫుడ్‌కోర్టు, పేదల బడ్డీలు తొలగింపు
- పేర్నినాని కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు



కుమ్మరిగూడెంలో పేదలు నిర్మించుకున్న 200 గృహాలను ఒకేరోజు నేలమట్టం చేసిన పాలకులు(ఫైల్)

మచిలీపట్నంటౌన్: కూటమి ఏడాది పాలనలో బందరులో అభివృద్ధి ఏమోగానీ కక్షసాధింపు చర్యలు, పేదల ఇళ్లు, బడ్డీకొట్లు కూల్చటం, టార్గెటెడ్‌గా అక్రమ కేసులు పెట్టడం వంటి చర్యలకే పాలకులు ప్రాధాన్యమిచ్చారు. నగరంలో మట్టి మాఫియా అడ్డగోలు దోపిడీని కొనసాగిస్తోంది. మండల పరిధిలోని కూటమి నాయకులు మంత్రి కొల్లు రవీంద్ర ఆశీస్సులతో అందినకాడికి దోచుకుంటున్నారనేది బహిరంగ రహస్యమే. రెవెన్యూ, పోలీస్, కార్పొరేషన్, మైనింగ్ తదితర శాఖల అధికారులనే పాలకులు ఆయుధాలుగా చేసుకుని వారి కక్షపూరిత పాలనను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముంపు సమస్య తీరేదెప్పుడో?

బందరులో ముంపు సమస్య పరిష్కారానికి పక్కా డ్రెయిన్‌లను నిర్మిస్తామని పాలకులు ఇచ్చిన హామీని బూచిగా చూపి నగరంలోని పలు ప్రాంతాల్లోని రోడ్ల మార్జిన్‌లో ఉన్న బడ్డీలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. అలాగే ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ వెనుక రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును సైతం మంత్రి కక్ష సాధింపుతో తొలగించారు. అయితే డ్రెయిన్ల వ్యవస్థను ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇక్కడి ప్రజా ప్రతినిధులు ఏడాది కాలంలో ఒక్క పైసాకూడా తేలేదు.

కక్షసాధింపుతో ఉద్యోగుల తొలగింపు..

కూటమి పాలనలో ఎంఎంసీ పరిధిలో పని చేస్తున్న పలు విభాగాల సిబ్బందిని, కార్మికులను వైఎస్సార్ సీపీకి అనుకూలం అనే ముద్ర వేసి తొలగించారు. కూటమి నాయకుల ప్రోద్బలంతో నిబంధనలకు విరుద్ధంగా కమిషనర్ వీరిని తొలగించి వీరి స్థానంలో కూటమి నాయకుల సిఫార్సులతో కొత్తవారిని నియమించారు. ఎంఎంసీ కార్యాలయంలో పని చేస్తున్న ఆరుగురు కంప్యూటర్ ఆపరేటర్లను, మెప్మా విభాగంలో పని చేస్తున్న దాదాపు 15 మంది ఆర్పీలను, దాదాపు 15 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. నోరు తెరిస్తే చాలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రమంతా విధ్వంసం జరిగిందని విమర్శించే కూటమి పాలకులు ఈ ఏడాది కాలంలో మచిలీపట్నం నియోజకవర్గంలో జరిగిన పాలనను ఏమనాలో వారే బదులిస్తే బావుంటుందని ప్రజలు కోరుతున్నారు.



రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చిరువ్యాపారుల బడ్డీలను తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

మన వాళ్లకే అంతా..

నగర పాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలకవర్గం అధికారంలో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మంత్రి కొల్లు రవీంద్ర ఎంఎంసీ పాలనను తన చేతులోకి తీసుకుని అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లకు పనులు చేయొద్దని కమిషనర్‌ను ఆదేశించటంతో ఆయన ఏకపక్షంగా పని చేసుకుంటూ పోతున్నారు. వీధి దీపాల నిర్వహణ కూడా టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ నిర్వహిస్తూ డివిజన్‌లలో వీధిదీపాలు వెలగకపోయినా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా బిల్లులు చేయించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేసులతో కక్షసాధింపు..

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్నినాని కుటుంబంపై కక్ష సాధింపుతో మంత్రి కొల్లు రవీంద్ర పావుల కదుపుతున్నారు. గోడౌన్‌లో సిబ్బంది తప్పిదానికి ఆయన సతీమణిపై కేసులు బనాయించారు. తాజాగా అక్రమ ఇళ్ల పట్టాలు ఇచ్చారంటూ ఆయన కుమారుడిపై కేసులు పెట్టే కుటిల యత్నాలను నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

పనులన్నీ కీలకనేత బినామీకే..

నగరపాలకసంస్థలో పనులన్నింటినీ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర బినామీగా విమర్శలెదుర్కొంటున్న కన్నా ప్రసాద్ అనే కాంట్రాక్టర్‌తో నామినేషన్ పద్ధతిలో ఇస్తున్నది నిజమా.. కాదా? అని ఇటీవల మాజీ మంత్రి పేర్నినాని ప్రశ్నించారు. రూ. 5లక్షల కన్నా పైబడిన పనులకు పాలకవర్గం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో కమిషనర్ బాపిరాజు ఎంఎంసీ జనరల్ ఫండ్ నిధులతో ఏ పనినైనా రూ. 4 నుంచి రూ. 4.50లక్షలుగా విభజించి నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్ కన్నా ప్రసాద్‌తో చేయిస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వినవస్తున్నాయి.

పేదల ఇళ్లపై కూటమి గద్దలు..

బందరులోని 41వ డివిజన్ కుమ్మరిగూడెం ప్రాంతంలోని పేద ప్రజలకు గత పాలకులు దాదాపు 200 స్థలాలు ఇచ్చారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పేదలు అప్పులు చేసి మరీ రేకుల షెడ్‌లను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు ఈ స్థలం అవసరమని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలతో కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పేదలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే భారీ పోలీసు బందోబస్తు నడుమ ఈ గృహాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. అదే డివిజన్‌లోని రాజీవ్‌నగర్‌లో ఓ ప్రైవేటు స్థలంలో రేకులషెడ్లు, పూరిళ్లు నిర్మించుకుని 30 ఏళ్లకు పైబడి ఉంటున్న పేదల గృహాలను కమిషనర్ బాపిరాజు కూల్చేప్రయత్నం చేశారు. రెండు ఇళ్లను పూర్తిగా కూల్చేశారు.



రాజీవ్‌నగర్‌లో పేదల గృహాలను తొలగిస్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్తులు

నిధులు నీళ్ల పాలేనా?

- సాగునీరొదిలాక పంటకాలువ పనులు
- ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు విడుదల
- సోమవారం పలుచోట్ల పంట కాలువల్లో కలుపు మందు పిచికారీ



అవనిగడ్డ మండలంలోని కేఈబీ కెనాల్‌లో కలుపు నివారణకు పురుగుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం

అవనిగడ్డ: పంట కాలువకు సాగునీరు వదిలిన తరువాత పనులు చేయడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ చోద్యం చూసిన ప్రజాప్రతినిధులు కాలువకు నీరొదిలిన తరువాత పనులు చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రూ.2.25 కోట్లు నిధులు నీటిపాలేనా అని నిలదీస్తున్నారు. నియోజకవర్గంలో కేఈబీ కెనాల్‌తో పాటు అన్ని పంట కాలువలు, డ్రెయిన్లలో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు కోసం ఈ ఏడాది రూ.2.25 కోట్లు మంజూరు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నెలరోజుల క్రితం ప్రకటించారు. వీటికి సంబంధించి కొన్నిచోట్ల మాత్రమే పనులు ప్రారంభించారు. ఇంకా కొన్నిచోట్ల పనులు మొదలుపెట్టలేదు. నెలరోజుల క్రితం ప్రకటించినా పనులు పూర్తి చేయకుండా పంట కాలువలకు సాగునీటిని విడుదల చేసిన తరువాత పనులు చేయడంపై దివిసీమ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ప్రకాశం బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు పూజలు చేసి సాగునీరు వదిలారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో పాటు గన్నవరం, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావ్, బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. సోమవారం దివిసీమలోని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్లలో కలుపు మందు పిచికారీ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొని పనులు పరిశీలించారు. ఇన్నాళ్లూ పనులు చేపట్టకుండా పంట కాలువకు సాగునీరు వదిలిన తరువాత హడావిడిగా పనులు చేయడం పట్ల దివిసీమ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటకాలువకు సాగునీరు వచ్చేలోపు పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పలుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. అయినా సాగునీరు వచ్చేలోపు పనులు పూర్తి చేయించలేకపోయారు. దీనికితోడు వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో తూతూ మంత్రంగా పనులు చేయడం వల్ల ఎవరికి ఉపయోగం ఉంటుందని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ జేబులు నింపుకోవడానికి మినహా రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని కొంతమంది రైతులు పెదవి విరుస్తున్నారు.

ఇంకా కొన్నిచోట్ల ప్రారంభం కాని పనులు..

నియోజకవర్గంలోని ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో ఇంకా కొన్నిచోట్ల పనులు ప్రారంభించలేదు. ఈ మండలాల్లో డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపడెక్కను తొలగించాల్సి ఉంది. లేదంటే కొద్దిపాటి వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. గత సంవత్సరం ఇలా పనులు చేయక పోవడం వల్ల చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురై రైతులు నష్టపోయారు. ఈ సంవత్సరం పనులు పూర్తి కాకపోవడంతో పంట పొలాలకు ముంపు ముప్పు పొంచి ఉంది.

వడి బియ్యంకు కిలో రూ.21.05



బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు భక్తులు సమర్పించే వడి బియ్యంకు కిలో రూ. 21.05 చొప్పున చెల్లించేందుకు కాంట్రాక్టర్‌కు ముందుకు వచ్చారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన వడి బియ్యం, నూనె డబ్బాల బహిరంగ వేలం పక్రియ సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించారు. ఏసీ రంగారావు పర్యవేక్షణలో ఏఈవోలు ఎస్. రమేష్‌బాబు, వెంకటరెడ్డి వేలం పక్రియ నిర్వహించారు. ముగ్గురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు. వడిబియ్యంకు ప్రథమ ధరావతుగా రూ. 50 వేలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన ఎస్.సంతోష్ వడిబియ్యంకు కిలోకు రూ.21.05 చొప్పున చెల్లింపుకు పాట దక్కించుకున్నారు. ఇక నూనె డబ్బాలను పిఠాపురానికి చెందిన చిన్న అప్పారావు డబ్బా ఒక్కింటికి రూ. 25-25లు చెల్లించేలా పాట దక్కించుకున్నారు. టెండర్ పక్రియలో లీజెస్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి



ఏపీడీకి సర్టిఫికెట్ అందజేస్తున్న సొసైటీ చైర్మన్ బాలాజీ

ఎయిర్‌పోర్ట్(గన్నవరం): సమాజంలో రక్తదాన ఆవశ్యకతను ప్రతిఒక్కరు గుర్తించాలని విజయవాడ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎల్. లక్ష్మీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విమానాశ్రయంలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ప్రారంభిచడంతో పాటు స్వయంగా ఆయన రక్తదానం చేసి మిగిలిన ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అపదలో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. రక్తదానం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని సొసైటీ జిల్లా చైర్మన్ బాలాజీ తెలిపారు. ముఖ్యంగా రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకురావాలని కోరారు. మొత్తం 33 మంది ఎయిర్‌పోర్ట్ ఉద్యోగులు రక్తదానం చేసినట్లు సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ తెలిపారు. ఎయిర్‌పోర్ట్ ఎంప్లాయిస్ కార్యదర్శి శ్రీహరి, సొసైటీ కోశాధికారి కె.రామ్‌బాలాజీ, గన్నవరం శాఖ చైర్మన్ చిన్ని మాధవి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ ఎం.విజయకుమార్, ఎం. ప్రభాకరచౌదరి, డాక్టర్ అంజనీకుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతన స్థిరీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం, నైపుణ్యం లేని కార్మికులకు వేతన స్థిరీకరణ చేస్తూ కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నాన్ మస్టర్‌రోల్ (ఎన్ఎంఆర్) వేతన స్థిరీకరణ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి నైపుణ్యం కలిగిన కార్మికులకు రోజుకు రూ. 849, పాక్షికం నైపుణ్యం కలిగిన వారికి రూ. 728, నైపుణ్యం లేని కార్మికులకు రూ. 606 వేతనం ధరలుగా నిర్ణయిస్తూ కమిటీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ సమావేశంలో డెప్యూటీ లేబర్ కమిషనర్ సీహెచ్ ఉషారాణి, మచిలీపట్నం అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ గోపాలరావు, ఇరిగేషన్ ఎస్ఈ ఆర్ మోహనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భర్తను కడతేర్చిన భార్య అరెస్ట్

చల్లపల్లి: బలమైన వస్తువుతో కొట్టి భర్తను చంపిన మహిళను అరెస్టు చేసినట్లు చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సోమవారం తెలిపారు. స్థానిక నారాయణరావునగర్‌లో నివాసం ఉంటున్న బోలెం మంగమ్మ తన భర్త బోలెం శ్రీనివాసరావును ఈ నెల 14వ తేదీన కొట్టడంతో తగలరానిచోట తగిలి శ్రీనివాసరావు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా శ్రీనివాసరావు మృతికి కారణమైన మంగమ్మను అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరుపరచగా ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆమెకు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



మీకోసంలో బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మీకోసం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పందన హాల్లో సోమవారం జరిగిన మీకోసంలో పాల్గొన్న ఆయన సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీకోసంలో అందిన అర్జీలను చట్ట పరిధిలో విచారణ జరిపించి పరిష్కరిస్తామని చెప్పారు. బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించిన ఆయన మరికొన్ని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి 42 అర్జీలు అందినట్లు తెలిపారు.

మనమిత్ర వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ డీకే బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, ఇతర సేవల కోసం మనమిత్ర వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహ మండలి సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక వసతులకు సంబంధించి ఆయాశాఖల వద్దకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని సూచించారు. సముద్రనాచు పెంపకానికి సంబంధించి ప్రాజెక్టు ఏర్పాటుకోసం మత్స్యకార మహిళలను సమకూర్చాలని వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పారిశ్రామికవేత్త కనకదుర్గ కలెక్టర్‌ను కోరారు. అలాగే వ్యర్థ, కాటన్ దుస్తులతో పర్యావరణ రహిత సంచులు, పరీక్ష ప్యాడ్లు, సెల్‌ఫోన్ స్టాండ్లు తదితర వస్తువులు తయారుచేస్తున్నామని వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేయాలని డీఆర్డీఏ పీడీ కు కలెక్టర్ సూచించారు. పోతేపల్లి జ్యూయలరీ పార్కులో తాగునీటి వసతి, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను జ్యూయలరీ పార్కు ప్రతినిధులు కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పైప్‌లైన్ ఏర్పాటు చేసి తక్షణమే నీటి వసతి కల్పనకు కృషి చేయాలన్నారు. గుడివాడలోని ఆటోనగర్‌లో చెల్లింపు పద్ధతిలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు, కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం స్థల సేకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఎల్‌డీఎం రవీంద్రారెడ్డి, డీపీవో జె అరుణ, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 3.50 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయండి

జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు నెలలో 3.50 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం సాయంత్రం మొక్కల పెంపకంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 2.51 లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. వాటన్నింటిని సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. జిల్లాలో ఇంకా 3.50 లక్షల మొక్కలను వివిధ పాఠశాలలు, వసతిగృహాలు, గ్రామపంచాయతీల్లో నాటేందుకు ప్రణాళికను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నగరంతో పాటు అన్ని పట్టణాల పరిధిలో ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటే ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్ శివప్రసాద్‌యాదవ్, డీఎఫ్‌వో సునీత, జెడీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ, డీఈవో పీవీజె రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫణికుమార్ మృతదేహం లభ్యం



ఫణికుమార్ (ఫైల్)



కృష్ణానది ఒడ్డుకు చేర్చిన ఫణి కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి

శ్రీకాకుళం(ఘంటసాల): కుటుంబానికి ఆసరాగా ఉంటున్న ఒక్కగానొక్క కుమారుడు కృష్ణానదిలో గల్లంతు కాగా సోమవారం లభ్యమైన మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం కృష్ణానదిలో గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఆత్కూరి ఫణి కుమార్ ఆదివారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ కృష్ణానదిలో పడి గల్లంతయ్యాడు. ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి ఎస్ఆర్‌డీఎఫ్ బృందాలతో కృష్ణానదిని జల్లెడపట్టగా సోమవారం సాయంత్రంఫణి కుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుని భౌతికకాయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఒడ్డుకు చేర్చగా తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ పర్యవేక్షణలో వీఆర్వో డి.గోపి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడు తండ్రి ధర్మరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

జి.కొండూరు: మండల పరిధి వెలగలేరు గ్రామం వద్ద పోలవరం కుడి కాల్వలో సోమవారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జి.కొండూరు ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీయించారు. మృతి చెందిన మహిళ వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా వేశారు. మృతదేహం పూర్తిగా డీ కంపోజ్ అయి ఉంది. వారం రోజుల క్రితం నీటిలో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

19న యోగాసన, చిత్రలేఖన పోటీలు



పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, యోగాసన సంఘం, సర్వోత్తమ ట్రస్ట్ ప్రతినిధులు

విజయవాడస్పోర్ట్స్: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి యోగాసన పోటీలు, యోగాసనాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందన్నారు. ఈ మేరకు సర్వోదయ ట్రస్ట్, కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గవర్నర్ పేటలోని బందర్ లాకులు వద్ద ఉన్న సర్వోదయ ట్రస్ట్, కృష్ణా జిల్లా స్వాతంత్ర సమరయోధుల సంఘ భవనంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆ రోజు ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు యోగాసనా పోటీలు, పది నుంచి 12:00 వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు 9441119909(యోగా), 9502944913 (చిత్రలేఖనం) నంబర్లను సంప్రదించి ముందస్తుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించడంతోపాటు పాల్గొన్న వారికి పార్టిసిపేషన్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని వివరించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సర్వోదయ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శవమై తేలిన అదృశ్యమైన వ్యక్తి

పెడన: లజ్జబండ డ్రెయిన్‌లో ఆదృశ్యమైన వ్యక్తి సోమవారం ఉదయం శవమై తేలాడు. తన కూతురుపై బెంగతో చూడాలనే ఆతృతతో ఎప్పుడూ వెళ్లే దగ్గర దారిలోనే లజ్జబండను దాటుతూ తెట్టుపై నుంచి జారి పడిపోయి కనిపించకుండా పోయాడు. సింగరాయపాలెం గ్రామానికి చెందిన మురాలా బాలచంద్రరావు(57) కొబ్బరిబొండాలు విక్రయిస్తూండేవాడు. ఈదుమూడిలో ఉండే తన కుమార్తె రాజులపాటి పుష్పకుమారిని చూసేందుకు ఆదివారం మధ్యాహ్నం బయలుదేరాడు. అడ్డరోడ్డులోని లజ్జబండ డ్రెయిన్‌ను దాటేందుకు వీలుగా రెండు పక్కల తాడు కట్టిన చోట తాడును పట్టుకుని తెట్టుపై డ్రెయిన్ దాటేందుకు ప్రయత్నం చేశాడు. తాడును వదిలి తెట్టుపై నుంచి జారీ పడిపోయాడు. తండ్రి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయడం, డ్రెయిన్‌లో పడిపోయి ఉంటారని అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ జి.సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో గాలించగా జారిపడిన ప్రాంతానికి కిలోమీటరు దూరంలో శవమై తేలుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

శ్రీభ్రమర హోమ్స్ నూతన వెంచర్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): శ్రీ భ్రమర హోమ్స్ సంస్థ విజయవాడ నగరానికి సమీపంలోని ఆకునూరు దగ్గర శ్రీ భ్రమర హోమ్స్ పేరుతో కొత్త ప్రాజెక్టుకు ప్రారంభించారు. స్థానిక బెంజ్‌సర్కిల్ సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో శ్రీ భ్రమర హోమ్స్ గ్రాండ్ ప్రీ-లాంచ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శ్రీ భ్రమర హోమ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళా రామచంద్రరావు ప్రాజెక్ట్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో పాటు వంద శాతం క్లియర్ టైటిల్, పక్కా వాస్తుతో అందరికీ అందుబాటుగా ఉండేలా వీటిని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దామని చెప్పారు. శ్రీ భ్రమర చేపట్టిన ప్రాజెక్టు 'శ్రీ భ్రమర హోమ్స్'లో విల్లాస్, విల్లా ప్లాట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎంఎస్ రాజు, ఎంపీకే లక్ష్మీపతి రాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, గుండేటి శివ, గుండా సుబ్బారావు, జమిలి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులు దుర్మరణం



తుమ్మాటి తనుష్ కుమార్



మాదాల ఏసు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామవరప్పాడు రింగ్ సెంటర్ ఇన్ హోటల్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడివాడకు చెందిన తుమ్మాటి తనుష్ కుమార్ (22) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు. తనుష్‌కుమార్ బాబాయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో బాబాయిని చూసేందుకు విజయవాడ వచ్చిన తనుష్‌కుమార్ తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రాత్రి 11.30 గంటలకు రామవరప్పాడు రింగ్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా ద్విచక్రవాహనంపై వచ్చిన మాదాల ఏసు (20) ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తనుష్‌కుమార్, ఏసులను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అదే ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ గాయపడిన యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాబాయిని చూడటానికి వచ్చిన తనుష్‌కుమార్ తిరిగి రాని లోకాలకు వెళ్లడంపై కుటుంబ సభ్యులు చేస్తున్న ఆర్తనాదాలు చూపరులను కంట తడిపెట్టించాయి.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సోమవారం తెలిపారు. మల్లాయపాలెం సమీపంలోని బైపాస్‌రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో మినీ వ్యాన్‌ను తనిఖీ చేశామని చెప్పారు. 34 బస్తాల్లో తరలిస్తున్న 1700 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బియ్యంతో పాటు, వాహనాన్ని సీజ్ చేశామని పేర్కొన్నారు. పామర్రుకు చెందిన వ్యాన్ డ్రైవర్ యండమూరి సీతారాముడును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కొత్తపేటకు చెందిన పెద్ది రామచంద్రరావు అదుపులోకి తీసుకున్నామని వివరించారు. రేషన్ కొనుగోలు చేసి వ్యాపారం చేసే వ్యవహారంలో ప్రధాన నిందితుడైన పెద్ది అర్జునరావును ఇంకా అదుపులోకి తీసుకోలేదని, వీలైనంత త్వరగా అరెస్ట్ చేస్తామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రేషన్ వ్యాపారం చేసే నిందితుడు అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడం వల్ల పోలీసులపై ఒత్తిడి వచ్చే అవకాశం ఉందని కొత్తపేట వాసులు పేర్కొంటున్నారు.

